సాక్షి
వరంగల్
సోమవారం । 1 । ఏప్రిల్ । 2024



దారికాచిన మృత్యువు

మృత్యువు దారికాచి ఇద్దరిని బలితీసుకుంది. వాహనాల రూపంలో వెంటాడి యువకులను పొట్టనపెట్టుకుంది. - 8లో ▸



ఒకే దేశం.. ఒకే చట్టం

ఒకే దేశంలో ఒకే చట్టం ఉండాలని సుప్రీం కోర్టు న్యాయవాది అశ్వినికుమార్ ఉపాధ్యాయ అన్నారు. - 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
$40^0/25^0$

జిల్లాలో ఉదయం నుంచి ఎండగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతతోపాటు వేడి పెరుగుతుంది. సాయంత్రం వేళ ఆహ్లాదకరంగా ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
సోమ 6:35	మంగళ 4:48

న్యూస్‌రీల్

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారిభోగేశ్వర్



విద్యారణ్యపురి: ఏళ్లతరబడి ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న వివిధ బిల్లులు వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సుబేదారి ప్రభుత్వ హైస్కూల్‌లో నిర్వహించిన సంఘం జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ విషయంలో ఉన్న గందరగోళాన్ని నివారించాలని చెప్పారు. ఇప్పటికే బదిలీ అయిన ఉపాధ్యాయులను ఏప్రిల్ 23న విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్, పూర్వ ఉపాధ్యాయుని దర్శిని సంపాదకులు బైరి స్వామి, బాధ్యులు ప్రసాద్, ఈదుల వీరస్వామి, మల్లయ్య, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి ప్రజావాణి రద్దు

కరీమాబాద్: వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం(నేడు) జరిగే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టర్ పి.ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, సిబ్బంది పార్లమెంట్ ఎన్నికల విధుల్లో నిమగ్నమైనందున ఈ నిర్ణయం తీసుకున్నామని ప్రజలు గమనించి అర్జీలు ఇవ్వడానికి కలెక్టరేట్‌కు రావొద్దన్నారు.

ప్రతీ క్రైస్తవుడు పునరుత్థానుడు కావాలి



కాజీపేట రూరల్: సర్వమానవాళి పాప పరిహారార్థం ఏసుక్రీస్తు శిలువపై మరణించి మూడవ రోజు పునరుత్థానుడు అయ్యాడు.. ప్రతీ క్రైస్తవుడు క్రీస్తు బాటలో నడిచి పునరుత్థానుడు కావాలని ఫాతిమా కెథిడ్రల్ చర్చి విచారణ గురువు ఫాదర్ కాసు మర్రెడ్డి, ఫాదర్ కరుణాకర్ అన్నారు. ఈస్టర్ పండుగను పురస్కరించుకొని కాజీపేట ఫాతిమానగర్ కెథిడ్రల్ చర్చిలో శనివారం అర్ధరాత్రి పస్కా జాగరణ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేసి క్రీస్తు ఈస్టర్ సందేశం ఇచ్చారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఆదివారం జరిగిన పస్కా జాగరణ మహోత్సంలో క్రైస్తవులు క్యాండిల్స్‌తో క్రీస్తును స్మరిస్తూ ఆరాధించారు.

యంగ్ సైంటిస్ట్ అవార్డుకు విద్యార్థి ఎంపిక



ఖిలా వరంగల్: ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రతిఏటా నిర్వహించే సెలక్షన్ యంగ్ సైంటిస్ట్ యువికా-2024 అవార్డుకు ఖిలా వరంగల్ మధ్యకోట ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి షేక్ నోమాన్ ఎంపికయ్యాడు. ఈ అవార్డు కోసం సుమారు లక్షా యాభై వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 350 మందిని ఎంపిక చేశారు. అందులో నోమాన్ ఒకరని హెచ్‌ఎం బత్తుల ప్రసాద్ తెలిపారు. హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌లో మే 14 నుంచి రెండు వారాల పాటు రెసిడెన్షియల్ పద్ధతి శిక్షణలో నోమాన్ పాల్గొంటాడని, ఖర్చు ఇస్రో భరిస్తుందని చెప్పారు. కాగా, ఆ విద్యార్థిని పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు శైలేంద్రకుమార్, కల్యాణ్, శ్రీధర్, భాస్కర్, నాగరాజు, రఘుపతి, సతీష్, జమునాదేవి, షకీరా బేగం ఆదివారం అభినందించారు.

నేడు బీఆర్‌ఎస్ వరంగల్ పార్లమెంట్ స్థాయి సమావేశం

హన్మకొండ: బీఆర్‌ఎస్ వరంగల్ పార్లమెంట్ స్థాయి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ తెలిపారు. మాజీమంత్రి హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

నీరులేక.. నిర్జీవమై

- కెనాల్ లేని ప్రాంతంలో అడుగంటిన చెరువులు
- వందలాది ఎకరాల్లో ఎండుతున్న పంటలు
- పంటలను కాపాడుకునేందుకు అన్నదాతల అగచాట్లు
- భూగర్భ జలాలు పడిపోవడంతోనే ఈ అనిశ్చితి



ఎండిపోయిన మంగళవారిపేటలోని ఊర చెరువు

సాక్షి, వరంగల్ : ఎండలు మండుతుండడంతో జిల్లాలోని చెరువులు, కుంటలు, వాగుల్లో నీరు అడుగంటిపోతోంది. దీంతో అన్నదాతల్లో కలవరం మొదలైంది. ఎస్సారెస్పీ కెనాల్ కింద ఉన్న చెరువులు ఇప్పుడిప్పుడే నిండుతున్నాయి. కెనాల్ సదుపాయం లేని ప్రాంతంలో మాత్రం నీరు లేక చెరువులు వెలవెలబోతున్నాయి. అక్కడ నీరు తగ్గిపోతూ ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. ఇలా జిల్లాలో ఓ వైపు కరువు ఛాయలు కనిపిస్తుండగా.. ఇంకోవైపు కెనాల్ నీటితో చెరువుల కింద ఉన్న పంట పొలాలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. మొత్తంగా చూసుకుంటే గతేడాదితో పోల్చుకుంటే ఈసారి భూగర్భ జల మట్టం తగ్గడంతోపాటు సరిపడా వర్షాలు కురవకనే చెరువులు, కుంటలు నీరు లేక తల్లడిల్లుతున్నాయి. ఫలితంగా ఆయా చెరువుల కింద పంటలు సాగు చేసిన రైతన్నలకు పెట్టుబడి వచ్చే పరిస్థితి కూడా కనిపించడం లేదు. ముఖ్యంగా చెరువుల కింద అత్యధికంగా వరి పంట సాగు చేసిన రైతులు ఏం చేయాలో తోచక కన్నీటి పర్యంతమవుతున్న పరిస్థితి నెలకొంది.



నల్లబెల్లి మండలం బజ్జుతండాలో ఎండిపోతున్న కూరగాయల పంట

మంగళవారిపేటలో..

ఖానాపురం మండలంలోని మంగళవారిపేట ఊర చెరువు కింద 100 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. చెరువులోని నీటి నిల్వ ప్రస్తుతం భారీగా తగ్గింది. దీంతో ఆయకట్టు కింద వరి పంటలన్నీ ఎండిపోయాయి. ప్రతిఏటా ఈ చెరువు కింద పుష్కలంగా పంటలు పండేవి. బావులు, బోర్లలో కూడా నీరు అడుగంటిపోయింది.

భయపెడుతున్న బంగారికుంట చెరువు..



నెర్రెలుబారిన బంగారికుంట చెరువు

నల్లబెల్లి మండలం బజ్జితండాలోని బంగారికుంట చెరువులో నీరు అడుగంటి పోవడంతో ఎండిపోయింది. చెరువు ఆయకట్టు సుమారు 150 ఎకరాలు ఉంటుంది. ఈ చెరువు కిందనే ఎక్కువగా వరి సాగు చేస్తున్నారు. అయితే కొందరు తమకున్న ఉన్న బోర్ల ద్వారా నీటిని పారిద్దామనుకున్నా వాటిలో కూడా నీళ్లు లేవు. దీంతో చివరికి వచ్చిన పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని బంగారికుంట చెరువు ఆయకట్టు రైతులు వాపోతున్నారు.

ఎండిపోతున్న ఎల్లాయగూడెం చెరువు..



చెరువులో అడుగంటుతున్న నీరు..

చెన్నారావుపేట మండలంలోని ఎల్లాయగూడెం ఊర చెరువు ఎండిపోతోంది. ఈ చెరువు కింద 160 ఎకరాల ఆయకట్టు భూమి సాగవుతోంది. గత సంవత్సరంలో ఈ సమయానికి పుష్కలంగానే నీరు ఉంది. ప్రస్తుతం ఈ చెరువులో నీళ్లు తగ్గుముఖం పడుతుండడంతో అన్నదాతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ చెరువు ప్రమాద ఘంటికలు మోగిస్తుండడంతో చుట్టూ ఉన్న భూగర్భజల మట్టాలు తగ్గి బావులు, బోర్లలోని నీరు అడుగంటిపోతోంది. దీంతో ఇప్పటికే చివరి దశలో ఉన్న పంటలు నీరు అందక ఎండిపోతున్నాయి.

1,04,485 ఎకరాల్లో వరి సాగు..

ఈ రబీ సీజన్‌లో 1,95,992 ఎకరాలకు 1,04,485 ఎకరాల్లో వరి పంట సాగుఅవుతోంది. ఇప్పటికే 30 శాతం పంటలు పూర్తిదశకు చేరుకోగా, మిగిలిన 70 శాతం పంటలు తుది దశలో ఉన్నాయి. ఈ సమయంలో భూగర్భజలాలు తగ్గిపోవడంతో బావులు, బోర్ల నుంచి సరిపడా నీరు రాక కొన్నిచోట్ల పంటలు ఎండుతున్న పరిస్థితి కనిపిస్తోంది. రిజర్వాయర్లు, ఎస్సారెస్పీ కెనాల్ ఉన్న ప్రాంతాల్లో కాస్తా పంటలు ఫర్వాలేదనుకున్నా, చెరువులపై ఆధారపడిన రైతులకు మాత్రం తిప్పలు తప్పడం లేదు. అయితే 2022-23 రబీ సీజన్‌లో 1,06,622 ఎకరాలకు 50,530 ఎకరాల్లో వరి సాగు చేశారు. అయితే ఇప్పుడదీ రెండింతలు కావడంతో రైతన్నల్లో నీటి ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇప్పటివరకు దాదాపు వెయ్యి ఎకరాల వరకు పంటలు ఎండిపోయి ఉండొచ్చని అధికారులు అంచనా. అంటే ఎకరానికి దిగుబడి 20 క్వింటాళ్లు అనుకుంటే దాదాపు 20 వేల



క్వింటాళ్ల ధాన్యం రానట్టే. అంతా ఏ-గ్రేడ్ ధాన్యానికి మార్కెట్ ధర రూ.2,203 ధర పలుకుతోంది. అంటే రూ.నాలుగు కోట్లకుపైగా రైతులకు నష్టం వాటిల్లినట్టే. దీనికితోడు లక్షల రూపాయల పెట్టుబడి రైతన్నలు నష్టపోయిన పరిస్థితి ఉంది. చాలామంది రైతులు బోర్లు వేసేందుకు రూ.లక్షలు వెచ్చించారు. ఇంకోవైపు పంట కూడా చేజారడంతో రైతుల కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి.

పంట ఎండుతోంది.. ఆదుకోండి



మాది నల్లబెల్లి మండలంలోని బజ్జు తండా గ్రామం. నాకున్న మూడు ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. బంగారి కుంట చెరువులో నీరు ఈసారి అడుగండడంతో చేతికందివచ్చిన వరి పంట పరిస్థితి చూస్తే భయమేస్తోంది. ఇంకోవైపు భూగర్భజల మట్టాలు అడుగంటి ఈ ప్రాంతంలోని బావుల్లో కూడా నీరు లేకుండాపోయింది. ఈ చెరువులో నీరు ఎండిపోవడంతో పొలం చేతికి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఇలా నీరు అందుబాటులో లేకుండా ఎండుతున్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలి. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేయాలి. **- అజ్మీరా చందర్, రైతు**

మళ్లొచ్చేది మనమే..



పంట పొలంలో బాధిత రైతులను ఓదారుస్తున్న మాజీ సీఎం కేసీఆర్

రైతులకు మాజీ సీఎం కేసీఆర్ భరోసా

- ఎండిన పంటల పరిశీలన
- దూసుకొచ్చిన జనం.. ఉక్కిరిబిక్కిరైన బీఆర్‌ఎస్ అధినేత
- పోలీసులు, రోప్‌పార్టీ వైఫల్యం
- 22 నిమిషాల్లో ముగిసిన పర్యటన

దేవరుప్పుల/జనగామ: వర్షాభావ పరిస్థితులతో చెరువులు, కుంటలు వట్టిపోయి.. భూగర్భ జలాలు అడుగంటడంతో ఎండిన వరి పంటలను పరిశీలించేందుకు ఆదివారం మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ జనగామ జిల్లాలో పర్యటించారు. దేవరుప్పుల మండలం ధరావత్‌తండాలో రైతు అముగోత్ సత్తెమ్మ వ్యవసాయ క్షేత్రంలో ఆమెతో పాటు రైతులు బానోత్ గేమునాయక్, పులుసోత్ ధన్‌సింగ్, బానోత్ లక్ష్మణ్, గుగులోత్ రాజమ్మ, పులుసోత్ జ్యోతిని ఓదార్చారు. సాగు చేసిన పంటలు, ఎండిన తీరు, సాగునీటి విడుదల, పెట్టుబడులు, రుణమాఫీ, రైతుబంధు పెట్టుబడి సాయం గురించి అడిగారు.

22 నిమిషాల పర్యటన

మధ్యాహ్నం 12.10 గంటలకు ప్రత్యేక బస్సు కాన్వాయ్‌తో ధరావత్‌తండాకు చేరుకున్న కేసీఆర్.. 12.32(22 నిమిషాలు)వరకు బాధిత రైతులతో ముఖాముఖి మాట్లాడారు.ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రం నుంచి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జోగినపల్లి సంతోష్‌కుమార్,భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశం,మాజీ మంత్రులు జగదీష్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మాలోత్ కవిత, రెడ్యానాయక్ తదితరులు కేసీఆర్ ప్రత్యేక బస్సులో రాగా.. మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, పొన్నాల లక్ష్మయ్య, సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, చల్లా ధర్మారెడ్డి, శంకర్‌నాయక్, తదితరులకు స్వాగతం పలికారు. వర్ధన్నపేట ఏసీపీ సురేష్ పర్యవేక్షణలో పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి, స్థానిక ఎస్సై చెన్నకేశవులు బందోబస్తు నిర్వహించారు.

చేతులెత్తేసిన పోలీసులు

కేసీఆర్ పర్యటన నేపథ్యంలో దేవరుప్పుల మండలం ధరావత్‌తండాకు రైతులతో పాటు జిల్లా నలుమూలల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఎండిన వరి పంటలను పరిశీలించేందుకు వచ్చిన కేసీఆర్‌కు మార్గం సుగమం చేయాల్సిన పోలీసులు, రోప్ పార్టీ తూతూ మంత్రంగా బందోబస్తు చేపట్టడంతో జనం ఒక్కసారిగా ముందుకు దూసుకొచ్చారు. దీంతో కేసీఆర్ బస్సులో నుంచి కిందకు దిగేందుకు ఐదు నిమిషాలపాటు ఇబ్బంది పడ్డారు. కిందకు వచ్చాక పొలం వద్దకు నడుచుకుంటూ వచ్చే క్రమంలో దయాకర్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఇతర నాయకులు అడ్డుగా నిలిచి కేసీఆర్‌ను మహిళా రైతు వద్దకు కష్టంగా తీసుకువెళ్లారు. ఈ సమయంలో పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారు. ఓ దశలో కేసీఆర్ కింద పడే పరిస్థితితో ఉద్రిక్తత నెలకొంది. దీంతో దయాకర్‌రావు దండం పెడతా.. కాళ్లు మొక్కుతా అంటూ బతిమి లాడుకున్నారు. కాగా, కేసీఆర్ పర్యటన నేపథ్యంలో సూర్యాపేట హైవే సింగరాజుపల్లి టోల్ ప్లాజా నుంచి మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించడంతో వాహనచోదకులు ఇబ్బందిపడ్డారు. బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్‌రామిరెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దయాకర్, రవి, బస్వ మల్లేషం, మాజీ ఎంపీపీ కొల్లూరి సోమన్న, అర్జున్ కేసీఆర్ పర్యటనలో ముఖ్యభూమిక పోషించారు. ధరావత్ తండాలో పర్యటన ముగించుకుని వెళ్లే క్రమంలో మొండ్రాయి చెక్ పోస్ట్ వద్ద వాహనాన్ని ఎన్నికల అధికారులు తనిఖీ చేశారు.



ధరావత్‌తండా వద్ద కార్యకర్తల మధ్యలో చిక్కుకుపోయిన కేసీఆర్‌కు రక్షణగా ఉన్న నాయకులు

రైతులతో కేసీఆర్ ముఖాముఖి ఇలా..

రైతు మాలోత్ లక్ష్మణ్‌తో



కేసీఆర్: తాతా ఎన్నెకరాలు సాగు చేసినవ్. పెట్టుబడి ఎంత
రైతు: మూడెకరాలకు రూ.80వేల వరకు అయ్యింది
కేసీఆర్: బోర్లలో నీళ్లు వస్తున్నాయా
రైతు: పాతబోర్లు రెండు.. కొత్తగ మరో రెండు వేసినా.. చుక్కనీరు రావడం లేదు.
కేసీఆర్: ఎండిన పంట వివరాలను అధికారులకు చెప్పుకో
రైతు: కాళ్లు మొక్కుతా సార్.. ఆదుకోకుంటే ఆగమే
కేసీఆర్: కాలం అలా వచ్చింది. బెంగ వద్దు. మేమున్నాం.

మహిళా రైతు పులుసోత్ జ్యోతితో..



రైతు: 8 ఎకరాల్లో వరి, రెండెకరాల్లో మిర్చి సాగు చేసిన. రూ.6 లక్షలు పెట్టుబడి అయింది. పొట్ట దశకు వచ్చిన వరిని కాపాడుకునేందుకు రూ.5 లక్షలతో బావి పూడికతీయించి 3 బోర్లు వేయించిన. చుక్క నీరు రాలేదు. రెండెకరాల వరి, రెండు ఎకరాల్లో మిర్చి పంట పూర్తిగా ఎండిపోయింది.
కేసీఆర్: ఎంత కష్టం వచ్చింది బిడ్డా. దుఃఖం వద్దు. మళ్లొచ్చేది మనమే. ధైర్యంగా ఉండు. అధికారులు వస్తే పంట నష్టం వివరాలు రాయించుకో.
రైతు: అప్పులు పుట్టే పరిస్థితి లేదు.
కేసీఆర్: కష్టం వచ్చినప్పుడు ఓర్చుకోవాలి. మంచి జరుగుతుంది.

రైతు బానోత్ గేమునాయక్‌తో..



కేసీఆర్: సాగునీరు అప్పుడు ఎలా వచ్చేది
రైతు: కాల్వల ద్వారా చెరువులు, కుంటలను నింపారు. భూగర్భ జలాలు పుష్కలం. వరి దిగుబడులు బాగా వచ్చాయి.
కేసీఆర్: ఈ యాసంగి ఎలా ఉంది
రైతు: చెరువులు ఎండినయ్. భూగర్భ జలాలు అడుగంటినయి. నాలుగెకరాల్లో మక్క పంట, ఎకరం వరి ఎండి పోయింది. పెట్టుబడికి రూ.1.50 లక్షలు, మూడు బోర్లకు రూ.1.40 లక్షలు ఖర్చు చేసిన. రెక్కల కష్టం మిగిలే పరిస్థితి లేదు. అప్పులు తీర్చేది ఎలా.
కేసీఆర్: సర్కారు చెప్పిన పథకాలు వస్తున్నయా. రుణమాఫీ జరిగిందా.
రైతు: ఐదెకరాలకు రైతు బంధు రాలేదు. రుణమాఫీ జరగలేదు.
కేసీఆర్: గుండె దిటువ చేసుకో.అండగా ఉంటాం.

ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి

- ఏఐసీసీ సభ్యుడు కత్తి వెంకటస్వామి

గీసుకొండ : కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ విధ్వంసకర విధానాలకు నిరసనగా ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను విజయతీరాలకు చేర్చాలని ఏఐసీసీ సభ్యుడు, వరంగల్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్ కత్తి వెంకటస్వామి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితో కలిసి ఆదివారం నిర్వహించిన ఎంపీ ఎన్నికల ప్రచార సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సారి ఎంపీ ఎన్నికల్లో పరకాల నియోజకవర్గంలో లక్ష ఓట్ల మెజారిటీ సాధించే దిశగా కార్యకర్తలు, నాయకులు ముందుకు సాగాలన్నారు. ఈ ఎన్నికలు మతతత్వ, నిరంకుశ, రాజ్యాంగ వ్యతిరేక శక్తులు, ప్రజాస్వామ్య పరిరక్షణ శక్తులకు మధ్య జరుగుతున్నాయన్నారు. రామ మందిరం, మతం పేరుతో



గీసుకొండలో మాట్లాడుతున్న ఏఐసీసీ సభ్యుడు కత్తి వెంకటస్వామి

బీజేపీ ఓటర్లకు గాలం వేస్తోందని, దమ్ముంటే మోదీ పేరుతో ఎన్నికల బరిలో నిలవాలని సవాల్ విసిరారు. ఎంపీపీ భీమగాని సౌజన్య, అధికార ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, చాడ కొమురారెడ్డి, మాజీ సర్పంచ్ అల్లం బాలిరెడ్డి, కొండేటి కొమురారెడ్డి, సంగెం మండల నాయకులు చొల్లేటి మాధవరెడ్డి, జనగాం రమేష్, నరహరి ఉన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్



కేంద్ర పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న బీజేపీ నాయకులు

నర్సంపేట : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ కోరారు. సమృద్ధి అభియాన్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 161, 162 బూత్‌ల్లో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి నర్సింహారాములు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి లబ్ధిదారులను కలిశారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారితో మాట్లాడారు. ఇంటింటా స్టిక్కర్లు అంటించి సరల్ యాప్‌లో అప్‌లోడ్ చేయించి మరోసారి మోదీని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో చేరికల కమిటీ చైర్మన్ డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, కౌన్సిలర్లు, పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, వివిధ మోర్చాల నాయకులు, బూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలను రద్దు చేయొద్దు

వర్ధన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం గురుకులాల (సీఓఈ)ను రద్దు చేసే యోచనను విరమించుకోవాలని రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ (ఆర్‌ఎస్‌పీ) రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా కార్యదర్శి వల్లందాసు కుమార్, అఖిలభారత రైతు సంయుక్త సభ జిల్లా కన్వీనర్ మల్లెపాక చంద్రమౌళి కోరారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల బంగారు భవిష్యత్ కోసం రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాకు ఒకటి చొప్పున సీఓఈ పాఠశాలలను మేధావులు, విద్యావేత్తలు ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. వీటిని రద్దు చేసే ఆలోచన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. గొలిదొడ్డి, అలుగునూరుతో పాటు మిగిలిన సీఓఈల్లో విద్యనభ్యసించిన విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు అయ్యారని వారు గుర్తుచేశారు. కార్పొరేట్



మాట్లాడుతున్న వల్లందాసు కుమార్

విద్యాసంస్థలను మరిపించే విధంగా అనేక విజయాలను సాధించిన ఘనత సీఓఈలకు ఉందని స్పష్టం చేశారు. ఇలాంటి సీఓఈలను రద్దు చేసే కుట్రలను ప్రజాస్వామ్యవాదులు, ప్రజాసంఘాలు, నాయకులు తిప్పి కొట్టవలసిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సమావేశంలో నాయకులు డి.సురేష్, కె.శేషునాథ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎల్బీ విద్యార్థి



రామన్నపేట: జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎల్బీ కళాశాలలో బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బి.సాయికుమార్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్.రావు, పీడీ ప్రభాకర్ తెలిపారు. ఈ పోటీలు బిహార్ రాష్ట్రంలో మార్చి 31 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా సాయికుమార్‌ను కరస్పాండెంట్ రాజేందర్, చైర్మన్ నిరంజన్ అభినందించారు.

మల్లన్నకు మొక్కులు



ఐనవోలు: శ్రీమల్లికార్జున స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించిన అనంతరం బోనం వండి అమ్మవారికి ఒడి బియ్యం, సారె సమర్పించారు. కోడెను కట్టి, శావతీసి(రథ సేవ) మొక్కులు తీర్చుకున్నారు. ఉగాది పండుగ వరకు జరిగే ఈ జాతరకు మరో వారమే మిగిలి ఉండటంతో పెద్ద ఎత్తున భక్తులు వచ్చారు.

కంఠమహేశ్వరస్వామికి జలాభిషేకం



బిందెలో నీళ్లు తీసుకొని ఊరేగింపుగా వెళ్తున్న గౌడ కులస్తులు

నల్లబెల్లి : కంఠమహేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో జలాభిషేకం ఆదివారం ఉత్సాహంగా కొనసాగింది. గౌడ కులస్తులు మంగళహారతులతో నీళ్ల బిందెలు ఎత్తుకొని దేవాలయానికి ర్యాలీగా వెళ్లారు. పూజారి రాజు ప్రత్యేక పూజలు చేయగా భక్తులు రేణుకా ఎల్లమ్మ, జమదగ్ని, కంఠమహేశ్వరస్వామి, సురమాంబ దేవి విగ్రహాలకు జలాభిషేకం చేశారు. అనంతరం పలువురు దంపతులు గౌరీ పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు ఏడు ఇళ్లలో జోగు ఎత్తుకున్నారు. వేడుకల్లో గౌడ సంఘం అధ్యక్షుడు గాదెగాని రమేష్, సంఘం సభ్యులు ముత్యాల చిన్న కొమురయ్య, సట్ల శ్రీనివాస్, తడుక అశోక్, బూర రామన్న, చుక్క సాంబయ్య, సుదగాని శంకర్, సుద్దాల ఆనందం, ముత్యాల కుమార్, రవికుమార్, పెరుమాండ్ల కోటి, మేడిపల్లి ఐలయ్య, లక్ష్మణ్, సట్ల రమేష్, నాగపురి రమేష్, తడుక అనిల్, కోయల వీరన్న తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మావోయిస్టుల పేరిట బెదిరింపులు

● హనుమకొండ పీఎస్‌లో కేసు నమోదు

వరంగల్ క్రైం: చాలా రోజుల తరువాత నగరంలో మావోయిస్టుల లేఖలు కలకలం సృష్టించాయి. హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని రెండు ఆసుపత్రుల యాజమాన్యాలకు మావోయిస్టుల పేరిట లేఖలు వెలువడ్డాయి. పోలీసుల కథనం ప్రకారం.. ములుగు రోడ్డులోని అజారా ఆసుపత్రి, బస్టాండ్ రోడ్డులోని దీపక్ ఆసుపత్రి యాజమాన్యాలకు మావోయిస్టుల పేరిట రెండు రోజుల క్రితం లేఖలు అందాయి. ఆ తరువాత గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్‌లలో బెదిరింపులు ఎదురయ్యాయి. ఈ ఘటనపై రెండు ఆసుపత్రుల యాజమాన్యాలు ఆదివారం హనుమకొండ పోలీసులను ఆశ్రయించి లేఖలు, ఫోన్ల వ్యవహారంపై ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. మావోయిస్టుల పేరిట బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులు ఎవరు అనే కోణంలో ఆరా తీస్తున్నారు. ఆసుపత్రుల యాజమాన్యాలకు చేసిన ఫోన్ల ఆధారంగా కూపీ లాగుతున్నట్లు తెలిసింది.

కంచనపల్లిలో గొర్రెల అపహరణ

రఘునాథపల్లి: మండలంలోని కంచనపల్లిలో ఆదివారం తెల్లవారుజామున 19 గొర్రెలు అపహరణకు గురయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మేకల అంజయ్య, పనికర శ్రీను కోమటిగూడెం రోడ్డులోని తమ వ్యవసాయ భూముల వద్ద పాకలు వేసి గొర్రెలు ఉంచారు. ఈ క్రమంలో దుండగులు పాకల వద్దకు చేరుకుని అంజయ్యకు చెందిన 15 గొర్రెలు, శ్రీనుకు చెందిన 4 గొర్రెలు అపహరించారు. బాధితులు ఉదయం పాకల వద్దకు చేరుకోగా గొర్రెలు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై నరేష్.. పాకల వద్దకు చేరుకొని గొర్రెల అపహరణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హైనా దాడిలో దూడ మృత్యువాత

తరిగొప్పుల : హైనా దాడిలో ఓ దూడ మృత్యువాత పడింది. ఈ ఘటన ఆదివారం మండలంలోని సోలిపురంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు దండెం రాజు పశువుల పాకపై హైనా దాడిచేసి దూడను హతమార్చింది. కాగా, హైనా దాడిలో దూడలు మృత్యువాత పడడం ఈ మధ్య సర్వసాధారణమైంది. సుమారు మండల వ్యాప్తంగా 15 దూడలు మృత్యువాత పడ్డాయి. ఈ విషయమై సంబంధిత అధికారులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.



జకాత్.. పుణ్యఫలం

● రంజాన్ మాసంలో పేదలకు దానధర్మాలు చేయాలి
● ధనికుల సంపాదనలో 2.5శాతం పేదలకు అందించాలి
● ప్రతి ముస్లిం ఐదు నియమాలు పాటించాలి



మహబూబాబాద్ అర్బన్ : రంజాన్ మాసంలో చేసే పుణ్య కార్యక్రమాల్లో ముఖ్యమైనవి దానధర్మాలు. దీనిని జకాత్ అంటారు. ముస్లింలు రంజాన్ మాసాన్ని అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. అదే విధంగా రంజాన్‌కు ఒకరోజు ముందు వరకు జకాత్ కొనసాగించొచ్చని ముస్లింల మత గురువులు తెలుపుతున్నారు. ముస్లింలు నీతిగా సంపాదించుకున్న ఆదాయంలో 2.5 శాతం సంపాదనను పేదలకు పంచాల్సిన వాటి పేరే జకాత్. ఇది పేదల హక్కుగా మహ్మద్ ప్రవక్త కూడా పాటించారు. ప్రతి నిరుపేద రంజాన్ పండుగ సంతోషకరంగా జరుపుకోవాలని దీని ముఖ్య ఉద్దేశం. ఈ జకాత్.. రంజాన్ మాసంలో చెల్లిస్తే రెట్టింపు పుణ్యఫలం దక్కుతుందని అందరి నమ్మకం.

హిజ్రీ క్యాలెండర్ ప్రకారమే పండుగలు..
ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు హిజ్రీ క్యాలెండర్ ప్రకారమే పండుగలు నిర్వహిస్తారు. మహమ్మద్ ప్రవక్త తన 53వ ఏటా మక్కా నుంచి మదీన వెళ్లారు. ఆ రోజు నుంచి హిజ్రాత్ క్యాలెండర్ ఆరంభమైంది. హిజ్రాత్‌నే కాలక్రమంలో హిజ్రీ క్యాలెండర్ అంటున్నారు. ఇందులో కూడా 12 నెలలు ఉంటాయి. చంద్రమానం ప్రకారం నెలలు లెక్కిస్తారు. నెలవంక కనిపించిన వెంటనే రంజాన్ మాసం ఆరంభవుతుంది. దీంతోపాటే ఉపవాస దీక్షలు కూడా ప్రారంభమవుతాయి.

ప్రతి ముస్లిం ఐదు నియమాలు కొనసాగించాలి..
ముస్లింగా పుట్టిన ప్రతీ ఒక్కరూ ఖురాన్ గ్రంథం ప్రకారం తప్పనిసరిగా ఐదు నియమాలు పాటించాలి. అప్పుడే వారు మరణానంతరం పరలోకానికి చేరుతారని ముస్లింల నమ్మకం. ఖురాన్ పవిత్ర గ్రంథం ప్రకారమే ఒకటి ఇమాన్.. అనగా(విశ్వాసం), రెండు.. నమాజ్ (ప్రార్థన), మూడు.. రోజ(ఉపవాసం), నాలుగు.. జకాత్ (దానం), ఐదు.. హాజ్ ఉమ్రా (హాజ్‌యాత్ర). వీటిని పాటించిన ప్రతీ ముస్లింకు సకల సంపదలు, ఆశీర్వాదం లభిస్తుంది.

ప్రతీ లెక్కకు అర్థం..
ఇస్లాంలు దానధర్మాలు చేయడంలో కొన్ని నిబంధనలు నిర్దేశించారు. ఒక సంవత్సర ధనం నుంచి రెండున్నర శాతం పేద వారికి దానం చేయడమే జకాత్ లక్ష్యం. ప్రతి రూ.100కు రూ.2.50 జకాత్‌గా పరిగణించాలి. బంగారం, వెండి ఉన్న దానిలో కూడా 2.5 శాతం నగదుగా, వ్యవసాయంలో పండించిన పంటలో కూడా ప్రతి 10 కిలోలకు పంటకు కిలో చొప్పున పంటను జకాత్ ఇవ్వాలి.

జకాత్‌కు అర్హులు, అనర్హులు..
జకాత్ ఎవరికి పడితే వారికి ఇవ్వొద్దు, తీసుకోకూడదు. అలాగని ఎవరికి పడితే వారికి జకాత్ ఇవ్వరు. అర్హులను గుర్తించి చెల్లిస్తారు. కుటుంబ సభ్యులైనా, బంధువులైనా, పేదలు, నిరుపేదలు, అనాథలు, వితంతులు, ఫకీర్లు, బాటసారులు, దైవ మార్గంలో ఉన్న వారికి, పేద ఆడపిల్లల వివాహం కోసం జకాత్‌ను తీసుకోవచ్చు. ఇవి ఇచ్చే వారు ఎవరికైనా అందజేయొచ్చు. రక్త సంబంధీకులు అనగా కొడుకులు, కూతుళ్లు, తల్లిదండ్రులు, అమ్మమ్మ, నానమ్మ, తాతయ్య, మనువలు, మనువరాళ్లు, బంధువులలో ఎవరైనా పేదవారు ఉంటే వారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వొచ్చు. ఆ తరువాత దగ్గరివారిలో పేదవారు ఉంటే ఇవ్వొచ్చు. అక్రమ సంపాదన ఈ జకాత్‌కు పరిగణలోకి రాదు. నీతిగా సంపాదించిన దానిలోనే దానధర్మాలు చేయాలని ఖురాన్ గ్రంథం జకాత్ ద్వారా తెలియజేస్తుంది.

జకాత్ ఆచరణలు పాటించాలి..



రంజాన్ పవిత్రమైన నెల. ఈ నెలలో ప్రతి ముస్లిం తప్పనిసరిగా 5 పూటల నమాజ్ చేయాలి. రాత్రి తరాబి నమాజ్ తప్పనిసరిగా చదవాలి. పగటిపూట 30 రోజులు ఉపవాసం ఉండాలి. ఉదయం 4:15 గంటల నుంచి సాయంత్రం 6:50 గంటల వరకు రోజా పాటించి పవిత్రంగా ఉండాలి. ఖురాన్ పఠించాలి. ఇది పిల్లల నుంచి మొదలు.. వృద్ధులు, పెద్దలు, మహిళలు, పురుషులు ఫిత్రా ఇవ్వాలి. నేటి సమాజంలో ముస్లింలు సంప్రదాయాలు మరిచిపోతున్నారు. తప్పనిసరిగా ఖురాన్ గ్రంథం శాంతిని సూచిస్తుంది.

-ముఫ్తీ మహ్మద్, ఆలంగీర్ ఇమామ్ సాహెబ్, మత గురువు, మానుకోట

జకాత్.. మా కుటుంబానికి కలిసొచ్చింది



నేను ప్రతి సంవత్సరం జకాత్ ఇవ్వడంతో నాకు బిజినెస్‌లో కలిసొచ్చింది. నేను పోలీసు శాఖలో పనిచేస్తున్నా. ప్రతి రంజాన్ మాసానికి పేదలకు దుస్తులు, పండుగ సామగ్రిని అందిస్తున్నా. దీంతో మా కుటుంబం సుఖ సంతోషాలతో ఉంటుంది.

- షేక్ అహ్మద్, పాతబజార్, మానుకోట

మాదిగలకు కాంగ్రెస్ మొదటి దోషి

● ఓటు అడిగే హక్కు ఆ పార్టీకి లేదు
● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ


మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

హన్మకొండ: మాదిగలకు అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీ మాదిగల దృష్టిలో మొదటి దోషి.. బీఆర్ఎస్ రెండో దోషి అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. ఆదివారం హనుమకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదిగలకు రాజకీయ అవకాశాలు కల్పించడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వివక్ష చూపుతున్నాయని, రాష్ట్రంలో మూడు ఎస్సీ పార్లమెంట్ స్థానాలుంటే మాదిగలకు ఒక్క స్థానంలోనూ అవకాశం కల్పించలేదన్నారు. 75 శాతం ఉన్న మాదిగలకు ఎంపీగా పోటీ చేసే అవకాశం ఇవ్వని కాంగ్రెస్‌కు ఓటు అడిగే హక్కు లేదన్నారు. మహబూబ్‌నగర్‌లో మాదిగలు 80 శాతం ఉంటే అక్కడ మాలలకు, పెద్దపల్లిలో 75 శాతం మాదిగలుంటే ఇక్కడ మాలలకు, వరంగల్‌లో 75 శాతం మాదిగలుంటే ఇక్కడ బైండ్ల సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు కావ్యకు టికెట్ ఇవ్వాలని చూస్తున్నారన్నారు. దీన్ని బట్టి చూస్తే కాంగ్రెస్‌లో మాదిగలకు గుర్తింపు లేదని అర్థమవుతోందని చెప్పారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్, నాయకులు మంద కుమార్‌మాదిగ, జన్ను దినేష్, మంద రాజు, గద్దల సుకుమార్ పాల్గొన్నారు.

క్రూ లింక్‌లు తరలిస్తే ఊరుకోం

● రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజన్ సెక్రటరీ రవీందర్


రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజన్ సెక్రటరీ రవీందర్

కాజీపేట రూరల్: కాజీపేట లోకోపైలెట్ డిపో నుంచి రైళ్ల క్రూ లింక్‌లను ఇతర ప్రాంతాలకు తరలిస్తే ఊరుకోమని కాజీపేటకు చెందిన సికింద్రాబాద్ డివిజన్ రైల్వే మజ్దూర్ యూనియన్ సెక్రటరీ పిల్లలమర్రి రవీందర్ డిమాండ్ చేశారు. 'కాజీపేట నుంచి రైళ్ల లింక్‌ల తరలింపు' అనే శీర్షికతో ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై రవీందర్ మాట్లాడారు. ఏకాగ్రతతో పనిచేసే లోకోపైలెట్లతో ఎక్కువ గంటలు పని చేయించాలని యత్నించడం సరికాదన్నారు. ప్యాసింజర్ రక్షణకు ప్రాముఖ్యం ఇవ్వాల్సిన తరుణంలో ఇలాంటి చర్యలతో లోకోపైలెట్లపై అధిక మానసిక, శారీరక ఒత్తిడి ఏర్పడుతుందన్నారు. ఎకనామీ పేరుతో ఎక్కువ పని గంటలు చేయించడం ప్రయాణికుల రక్షణకు తూట్లు పొడవమేనన్నారు. ఇంతకు ముందు యూనియన్ అనేక పోరాటాలు చేసి కాజీపేట డిపోను కాపాడుకుందని, ఇప్పటికైనా డిపోను నిర్వీర్యం చేసే కుట్ర మానుకోవాలని డిమాండ్ చేశారు.

రూ.లక్షా65 వేల నగదు స్వాధీనం

పరకాల: లోక్‌సభ ఎన్నికల తనిఖీల్లో భాగంగా ఆధారం లేకుండా తరలిస్తున్న రూ.లక్షా65వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పరకాల సీఐ రవిరాజు ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం పాత ఏటీఎం సెంటర్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో రేగొండకు చెందిన గిరబోయిన చిన్ని ఆధారం లేకుండా బైక్‌పై తరలిస్తున్న రూ.లక్షా65వేలు స్వాధీనం చేసుకున్నారు.

ఒకే దేశం.. ఒకే చట్టం

● సుప్రీం కోర్టు న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ


మాట్లాడుతున్న సుప్రీం కోర్టు న్యాయవాది అశ్విని కుమార్

హన్మకొండ: ఒకే దేశంలో ఒకే చట్టం ఉండాలని సుప్రీం కోర్టు న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ అన్నారు. ప్రజ్ఞా భారతి ఆధ్వర్యంలో హనుమకొండ నయీంనగర్‌లోని వాగ్దేవి జూనియర్ కళాశాల ఆడిటోరియంలో 'ఏక్ భారత్ ఏక్ విధాన్, వన్ నేషన్, వన్ పాలసీ' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సులో అశ్విని కుమార్ ఉపాధ్యాయ ప్రధాన వక్తగా పాల్గొని దేశమంత ఒకేరకమైన చట్టం ఎందుకు అవసరమో ఉదాహరణతో వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఉభయ సభల్లో ఒకే దేశం ఒకే చట్టం అంశంపై చర్చలు జరుగుతున్నాయే కాని పరిష్కారం లభించడం లేదన్నారు. రాజకీయ నాయకులు ఓటు, నోటుకే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. శాసనసభ, పార్లమెంట్ సభ్యులు ప్రజలకు అవసరమయ్యే మంచి చట్టాలు తీసుకురావడం కోసం ఎన్నుకోబడ్డారన్నారు. అయితే వారికే సౌకర్యాలు కల్పించుకుంటున్నారని విమర్శించారు. దేశంలోని పౌరులందరికీ ఒకే విధమైన చట్టాలు ఉండాలన్నారు. షరియత్ చట్టం ప్రకారం మహిళల వివాహ వయసు 9 సంవత్సరాలు మాత్రమేనన్నారు. ఉమ్మడి పౌర చట్టం అమలైతే దీంతో మేలు జరిగేది ముస్లింలకేనని వివరించారు. అవినీతి కారణంగా రూ.15 వేలతో అక్రమ వలసదారులు దేశ పౌరసత్వం పొందారన్నారు. పౌరసత్వం పొందిన తర్వాత ప్రభుత్వ పథకాలు, రాయితీలు అర్హత లేకున్నా పొందుతున్నారని, ప్రజాధనాన్ని కాజేస్తున్నారన్నారు. దేశంలో వివిధ నేరాలకు వివిధ చట్టాలు అమలులో ఉన్నాయన్నారు. వాటిని క్రోడీకరించి ఒకే చట్టం రూపొందించాల్సిన అవసరముందన్నారు. న్యాయ, విద్య, పోలీసుతో పాటు అనేక రంగాలలోని వివిధ చట్టాలను క్రోడీకరించి ఉమ్మడి పౌరస్మృతిని పౌరులందరికీ అమలు చేయాలన్నారు. ప్రజ్ఞాభారతి రాష్ట్ర సహాయ కార్యదర్శి చామర్తి ప్రభాకర్ రావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో గీతాంజలి మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ వేణుమాధవ్, సీనియర్ న్యాయవాది మహేంద్ర ప్రసాద్, ప్రజ్ఞాభారతి రాష్ట్ర సహాయ కార్యదర్శి మోపిదేవి రాజేష్ కుమార్, కోకన్వీనర్ తక్కళ్లపల్లి బుచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే


దుగ్గొండి: దగ్ధమవుతున్న మిర్చి బస్తాలు

తొర్రూరు రూరల్: షార్ట్ సర్క్యూట్‌తో ఆదివారం మండలంలోని గుడిబండ తండా జీపీ పరిధి కండియా తండాకు చెందిన బానోతు శ్రీను ఇల్లు కాలిబూడిదైంది. అతుకులు కలిగిన విద్యుత్ తీగలు అంటుకోవడంతో ఇల్లు విద్యుదాఘాతంతో దగ్ధమైంది. ఈ ప్రమాదంలో పత్తి పంట, నిత్యావసర సరుకులు, ఇతర సామగ్రి అగ్నికి ఆహుతైంది. సుమారు రూ. లక్ష వరకు నష్టం జరిగిందని బాధితుడు కన్నీరుమున్నీరయ్యారు. సమాచారం తెలుసుకున్న పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అనుమాండ్ల ఝాన్సీరెడ్డి.. బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం పక్షాన కూడా ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, అనుమాండ్ల తిరుపతిరెడ్డి, సుంచు సంతోష్, సోమరాజ శేఖర్, పాల్గొన్నారు.

తిమ్మంపేటలో మిర్చి..
దుగ్గొండి: విద్యుదాఘాతం సంభవించి లారీలో లోడ్ చేసిన మిర్చి దగ్ధమైంది. ఈ ఘటన ఆదివారం రాత్రి మండలంలోని తిమ్మంపేటలో జరిగింది. గ్రామానికి చెందిన కొంతమంది రైతులు తమ మిర్చిపంటను నాగపూర్ మార్కెట్‌కు తరలించడానికి లారీలో లోడ్ చేశారు. లారీ బయలుదేరగా గ్రామ ప్రధాన రహదారిపై విద్యుత్ తీగలు తగిలి మంటలు లేచాయి. దీంతో లారీలోని 10 బస్తాలు సుమారు 4 క్వింటాళ్ల మిర్చి దగ్ధమైంది. వెంటనే గమనించిన రైతులు లారీ నుంచి బస్తాలను కిందికి తోశారు. దీంతో పెనుప్రమాదం తప్పింది. అయినా తమకు రూ. 2లక్షల వరకు నష్టం సంభవించిందని అన్నదాతలు తెలిపారు.

వరంగల్ పార్లమెంట్ టికెట్ మాదిగలకే ఇవ్వాలి


దప్పుచప్పుళ్లతో నిరసన తెలుపుతున్న మాదిగ సామాజిక వర్గం నాయకులు, కార్యకర్తలు

హన్మకొండ: కాంగ్రెస్ పార్టీ.. వరంగల్ పార్లమెంట్ స్థానం మాదిగ కులస్తులకే కేటాయించాలని మాదిగ సామాజికవర్గం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి భిక్షపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం మాదిగ సామాజిక వర్గం ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు డప్పుచప్పుళ్లతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ, నిరసన కార్యక్రమానికి అనుమతి లేదని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, నిరసనకారుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మాదిగ కులస్తులకు అన్యాయం చేస్తున్నాయన్నారు. రిజర్వేషన్లలో భాగంగా ఏ పార్టీ అయినా మూడు స్థానాల్లో రెండు మాదిగ సామాజిక వర్గానికి ఇవ్వాల్సి ఉండగా కాంగ్రెస్.. రెండు స్థానాలు మాల వర్గానికి ఇచ్చిందని, వరంగల్ పార్లమెంట్ టికెట్ అయినా మాదిగ సామాజిక వర్గానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కడియం శ్రీహరి.. మాదిగ నాయకులను ఎదగకుండా కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ.. కడియం కుటుంబానికి టికెట్ ఇస్తే చిత్తుగా ఓడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మట్టెడ అనిల్, అల్వాల ఉమేందర్, మాదాసి శివకుమార్, వక్కల రవీందర్, మాదాసి సురేష్, మునిగాల భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

రామన్నపేట: వరంగల్ పెద్దమ్మగడ్డకు చెందిన పులుమారి సుధీర్ శనివారం సాయంత్రం ములుగు రోడ్డులోని పెద్దమ్మగడ్డ బ్రిడ్జి వద్ద గల ఎస్సారెస్పీ కెనాల్‌లో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మగోపి తెలిపారు. సుధీర్.. సుమారు మూడు గంటల ప్రాంతంలో తన ఇంటి నుంచి కారు డ్రైవింగ్ చేసుకుంటూ కెనాల్‌లో దూకినట్లు సీఐ తెలిపారు. పసుపు రంగు టీషర్ట్, బ్లూ జీన్స్ ధరించి 5.6 అడుగుల ఎత్తు కలిగిన సుధీర్‌ను ఎవరైనా గుర్తుపడితే 8712685117, 8712685005 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

ఆ పిల్లలకు టెంటే.. ఇల్లయింది

● ఐదురోజులుగా అక్కడే గడుపుతున్న బాధితులు
● తల్లిదండ్రుల మృతితో ఒంటరైన ముగ్గురు పిల్లలు


టెంటు కిందే ఉంటున్న ఒంటరైన ముగ్గురు పిల్లలు

కేసముద్రం: కొంతకాలం క్రితం తండ్రి.. ఇటీవల తల్లి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ దంపతుల ముగ్గురు పిల్లలు ఒంటరయ్యారు. కనీసం తల దాచుకోవడానికి ఇల్లు లేకపోవడంతో ఖాళీ స్థలంలో వేసిన టెంటు కిందే బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్న సంఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రం చైతన్యనగర్‌కాలనీలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. చైతన్యనగర్‌కాలనీకి చెందిన దుర్గం ధర్మయ్య, శోభ దంపతులకు ఇద్దరు కుమారులు దేవేందర్, అమర్, కుమార్తె అఖిల ఉన్నారు. మొదట పూరిగుడిసెలో ఉంటూ కూలీ పనులకు వెళ్తూ ఆ దంపతులు జీవనం సాగిస్తూ వచ్చారు. నాలుగేళ్ల క్రితం ధర్మయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో బతుకుదెరువు కోసం శోభ తన ముగ్గురు పిల్లలతో కలిసి పుట్టిన ఊరు నర్సంపేటకు వెళ్లింది. అక్కడ అద్దెగదిలో ఉంటూ జీవనం సాగిస్తున్నది. 7, 8వ తరగతి వరకు చదువుకున్న ఇద్దరు కుమారులను ఆర్థిక స్తోమత లేక చదువు మాన్పించి కూలి పనులకు తీసుకెళ్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. ఈ క్రమంలో 8 నెలల క్రితం నర్సంపేటలో ఇంట్లో జరిగిన అగ్నిప్రమాదంలో శోభ తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతుండగా.. 7వ తరగతి చదువుతున్న కూతురు అఖిల చదువు మానేసి తల్లికి సపర్యలు చేస్తూ వచ్చింది. ఈ క్రమంలో ఐదురోజుల క్రితం పరిస్థితి విషమించడంతో ఆమె మృతి చెందింది. అద్దె ఇల్లు కావడం, బంధువులు లేకపోవడంతో శోభ మృతదేహాన్ని చైతన్యనగర్‌కాలనీకి తీసుకువచ్చారు. తండ్రి బతికి ఉన్నప్పుడు నివసించిన గుడిసె కూలిపోవడంతో ఖాళీ స్థలంలోనే టెంటు వేసి అంత్యక్రియలు నిర్వహించారు. ఐదు రోజుల నుంచి అదే టెంటు కింద పిల్లలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. వారి దీనస్థితిని చూసి అంతర్యామి సంస్థ రూ.8వేలు, బీఆర్ఎస్ నేత రూ.3,500, చిలువేరు సమ్మయ్యగౌడ్ 50 కేజీల బియ్యం అందజేశారు. బాధిత పిల్లలను దాతలు ఆదుకోవాలని, ప్రభుత్వం ఇల్లు కట్టించాలని స్థానికులు కోరుతున్నారు.

భోజనానికి డబ్బులు లేవని..సెల్‌ఫోన్ల చోరీ

● ఇద్దరి అరెస్ట్ ● వివరాలు వెల్లడించిన పోలీసులు

పరకాల: పరకాల ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ప్రయాణికుల వద్ద నుంచి సెల్‌ఫోన్‌లు చోరీ చేసిన ఇద్దరిని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. సీఐ రవిరాజు కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన ఇద్దరు యువకులు ఆకాశ్ ప్రధాన్, సమీర్ ప్రధాన్ కూలి పనికోసం వరంగల్‌కు చేరుకున్నారు. అనంతరం బస్సులో వరంగల్ నుంచి కాళేశ్వరం వైపునకు వెళ్తూ పనికోసం పరకాలలో దిగారు. అయితే భోజనాలకు డబ్బులు లేకపోవడంతో చోరీ చేయడానికి నిర్ణయించుకున్నారు. అనంతరం పరకాల బస్టాండ్‌కు చేరుకుని రద్దీగా ఉన్న సమయంలో బస్సు ఎక్కే ఇద్దరి ప్రయాణికుల నుంచి రెండు సెల్‌ఫోన్‌లు కాజేశారు. అంతటితో ఊరుకోకుండా మళ్లీ బస్టాండ్‌కు చేరుకోగా బాధితులు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. దీంతో ఇద్దరిని అరెస్ట్ చేసి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్సై రమేష్, కానిస్టేబుల్ నాగరాజు, హోంగార్డు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

దారికాచి కాటేసిన మృత్యువు..

వెనుక ఓ వాహనం.. ముందు ఎడ్లబండి ఢీ
● రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం
● మచ్చాపూర్ శివారులో ఘటన


ప్రభాకర్(ఫైల్)


సామ్యూల్ (ఫైల్)


ఘటనాస్థలిని పరిశీలిస్తున్న పోలీసులు

గీసుకొండ: మృత్యువు దారి కాచి మరీ ఇద్దరి ప్రాణాలను హరించింది. వాహనాల రూపంలో వెంటాడి బలితీసుకుంది. బైక్ పై తమ ఇంటికి వెళ్తున్న వారి వాహనాన్ని వెనుకవైపు నుంచి వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో బైక్ అదుపుతప్పి అదే దారిలో ముందు వెళ్తున్న ఎడ్లబండిని వెనుక వైపున ఢీకొంది. తీవ్రగాయాలతో కింద పడి ఉన్న వారిపై మరో గుర్తుతెలియని వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం మచ్చాపూర్ శివారులో వరంగల్–నర్సంపేట రహదారిపై ఆదివారం ఉదయం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నర్సంపేట పట్టణానికి చెందిన మడికొండ ప్రభాకర్(27), ఇమ్మడి సామ్యూల్(21) పని నిమిత్తం వరంగల్‌లోని బంధువుల ఇళ్లకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మచ్చాపూర్ శివారు వారి బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో వాహనం అదుపుతప్పి ముందు వెళ్తున్న ఎడ్లబండిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రభాకర్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే, సామ్యూల్ పై నుంచి మరో గుర్తుతెలియని వాహనం వెళ్లగా అతడు కూడా అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై సమాచారం అందుకున్న గీసుకొండ ఇన్‌స్పెక్టర్ ఎల్.వసన్‌కుమార్, ఎస్సై జానీపాషా ఘటనా స్థలిని సందర్శించారు. అనంతరం మృతుడు ప్రభాకర్ అన్న రంజిత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ముచ్చర్ల క్రాస్ వద్ద మరో యువకుడు..


వలీ(ఫైల్)

హసన్‌పర్తి: ఎంజీఎంలో చికిత్స పొందుతున్న తమ బంధువులను పరామర్శించడానికి బైక్‌పై వెళ్తూ ఓ యువకుడు రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం యాదాద్రి–ఆరెపల్లి జాతీయ రహదారి మార్గమధ్యలోని ముచ్చర్ల క్రాస్ వద్ద జరిగింది. ఈ మేరకు మృతుడి తండ్రి కేయూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ సంజీవ కథనం ప్రకారం.. నగరంలోని మునిపల్లికి చెందిన షేక్ వలీ(20) కూలీ పనిచేస్తూ తల్లిదండ్రులకు ఆసరాగా ఉంటున్నారు. అనారోగ్య కారణంతో బాధపడుతూ ఎంజీఎంలో చికిత్స పొందుతున్న బంధువులను పరామర్శించడానికి మునిపల్లి నుంచి జాతీయ రహదారి మీదుగా ఎంజీఎంకు బయలుదేరాడు. ముచ్చర్ల క్రాస్ వద్ద బైక్‌ను యూటర్న్ చేస్తున్న క్రమంలో పరకాల వైపు నుంచి కరీంనగర్ వైపునకు వెళ్తున్న కారు.. బైక్‌ను ఢీకొంటూ అదేవేగంతో రోడ్డు పక్కన ఉన్న డబ్బాలపైకి దూసుకెళ్లింది. ఈప్రమాదంలో వలీ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

హక్యాతండా శివారులో బైక్‌పై నుంచి పడి వ్యక్తి ..


వెంకన్న(ఫైల్)

కొడకండ్ల : బైక్‌పై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని హక్యాతండా శివారులో చోటుచేసుకుంది. మండలకేంద్రానికి చెందిన సున్నపు వెంకన్న(42) బైక్‌పై ఆదివారం వెలికాల నుంచి కొడకండ్లకు వస్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని హక్యాతండా శివారులో బైక్ అదుపు తప్పి కింద పడింది. ఈ ఘటనలో వెంకన్నకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించగా మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బండి శ్రావణ్‌కుమార్ తెలిపారు.